గిరి ప్రదక్షిణకు సన్నాహాలు



ముడసర్లోవ వద్ద ఫుట్‌పాత్‌లపై జీవీఎంసీ ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు



దీన్‌దయాల్‌పురం వద్ద స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వేసిన టెంట్‌లు

- తుది దశకు చేరిన ఏర్పాట్లు
- జీవీఎంసీ, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు
- భక్తుల సేవలకు స్వచ్ఛంద సంస్థల ఆసక్తి

ఆరిలోవ: సింహాచలం అప్పన్న గిరి ప్రదక్షిణకు సన్నాహాలు తుది దశకు చేరాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు, జీవీఎంసీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు భక్తులకు సేవలు అందించడానికి స్వచ్ఛంద సంస్థలు రెండు రోజుల నుంచి స్థలాలు రిజర్వ్ చేసుకుంటున్నాయి. ఇప్పటికే రోడ్డు పక్కన పలువురు టెంట్లు వేశారు. ఇంకొందరు వేస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణకు రావచ్చని అధికారులు అంచనా వేసి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. సాధారణంగా సింహాచలం తొలి పావంచా వద్ద భక్తులు కొబ్బరికాయ కొట్టి నడక ప్రారంభించడం ఆనవాయితీ. ఇప్పుడు పైనాపిల్ కాలనీ, అడవివరం మధ్యలో కొత్తగా నిర్మించిన ఘాట్ రోడ్డు వద్ద కూడా తొలపావంచా ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ కూడా స్వామికి కొబ్బరి కాయలు కొట్టి నడక ప్రారంభించేలా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. దీనికి సమీపంలో అడవివరం కూడలి నుంచి పైనాపిల్ కాలనీ, ముడసర్లోవ, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు సుమారు 9 కిలోమీటర్లు పొడవున ఐదు లైన్లతో ఉంది. అక్కడి నుంచి హనుమంతవాక కూడలి, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం వరకు సింగిల్ లైన్‌లో ప్రధాన రహదారి ఉంది. జోడుగుళ్లపాలెం నుంచి తెన్నేటి పార్కు మీదుగా అప్పుఘర్ వరకు రెండు లైన్‌ల బీచ్ రోడ్డు ఉంది. ఆయా మార్గాల్లో జీవీఎంసీ, ఆరిలోవ పోలీసులు భక్తులు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో విద్యుత్ మరమ్మతులు

- తూర్పు నియోజకవర్గం పరిధి అడవివరం కూడలి నుంచి ముడసర్లోవ, హనుమంతవాక మీదుగా అప్పుఘర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బీఆర్‌టీఎస్ రోడ్లను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తున్నారు. గోతులను పూడ్చారు. వెలగని విద్యుత్ దీపాలను పరిశీలించి కొత్తవి అమర్చుతున్నారు. అడవివరం, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ముడసర్లోవ, చినగదిలి, విమ్స్ ఆస్పత్రి, జోడుగుళ్ల పాలెం, అప్పుఘర్ వద్ద తాత్కాలిక మరుగుదొడ్లను సిద్ధం చేశారు. వైద్య విభాగం సహకారంతో రెండు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. మధ్యలో ప్రథమ చికిత్స కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.
- అడవివరం కూడలి నుంచి హనుమంతవాక వరకు, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, అప్పుఘర్ వరకు ఆరిలోవ పోలీసులు భక్తులకు రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. హనుమంతవాక కూడలిలో ఓ ఏసీపీ స్థాయి అధికారి, కొందరు సీఐలు, ఎస్‌ఐలతో పాటు మరో 40 మంది సిబ్బందితో విధులు నిర్వహించడానికి సన్నాహాలు చేపట్టారు. ప్రతి 100 మీటర్లకు మహిళా, పురుష కానిస్టేబుళ్లు ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా పోలీసులు విధులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

స్వచ్ఛంద సంస్థల ప్రత్యేక స్టాళ్లు

ప్రతి సంవత్సరం గిరిప్రదక్షిణ భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, పలు ఆలయ కమిటీలు, కాలనీ, కుల సంఘాలు, బీఆర్‌టీఎస్‌లో స్టాళ్లు ఏర్పాటు చేయడం పరిపాటి. ఈ ఏడాది కూడా స్వచ్ఛంద సంస్థలు ప్రసాదం పంపిణీకి సిద్ధమవుతున్నాయి. బీఆర్‌టీఎస్‌లో ఫుట్‌పాత్‌లపై ఇప్పటికే పలువురు స్థలాలను మార్కింగ్ చేసుకున్నారు. ఇంకొందరు టెంట్లు వేస్తున్నారు. పులిహోర, ప్రసాదం, ఉడకబెట్టిన శనగలు, బూరెలు, టీ, తాగునీరు, అరటిపళ్లతో పాటు మందులు కూడా పింపిణీ చేయనున్నారు. అడవివరం నుంచి జోడుగుళ్లపాలెం వరకు సుమారు 100కు పైగా స్టాళ్లు అందుబాటులో ఉండనున్నాయి.

రక్షణ చర్యలు కట్టుదిట్టం



బీఆర్‌టీఎస్, బీచ్ రోడ్డులో కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపడుతున్నాం. ఈ నెల 2న జరగనున్న గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. బీఆర్‌టీఎస్‌లో అన్ని లైన్లలోనూ వాహనాల రాకపోకలు నిలిపివేస్తాం. హనుమంతవాక కూడలి వద్ద ట్రాఫిక్ నియంత్రణకు సుమారు 50 మందికి పైగా పోలీసులు విధుల్లో ఉంటారు. ప్రసాద వితరణ కోసం స్టాళ్లు ఏర్పాటు చేస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– సోమశేఖర్, ఆరిలోవ సీఐ

‘జగనన్న సురక్ష’ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల సూచించారు. శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన పెంచే దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఎంవీపీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా 11కి పైగా సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. నియోజవర్గంలో 8 రోజుల పాటు 2 బృందాలు వార్డుల వారీగా సేవలు అందిస్తాయన్నారు. ఆయా తేదీల్లో వార్డుల్లో నిర్వహించే క్యాంపుల ద్వారా ప్రజలు ఈ సేవలను పొందాలని కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా వలంటీర్లు ముందస్తుగా టోకెన్లు కూడా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు ముప్వల లక్ష్మి, అక్కరమాని రోహిణి, కెల్ల సునీత, ఉమ్మిడి స్వాతి, పార్టీ నాయకులు జగ్గుపిల్లి అప్పలరాజు, పీతల గోవింద్, సూరాడ వెంకటలక్ష్మి, పుక్కళ్ల ధనలక్ష్మి, పల్లా దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో పలు అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.6.5 లక్షల నిధులతో కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ ప్రతీ సచివాలయం పరిధిలో స్థానికంగా అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముప్వల లక్ష్మి, ఏఈ శిరీష, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

సింబియోసిస్ చైర్ ప్రొఫెసర్ ఏర్పాటు



రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌కు చెక్కు అందిస్తున్న నరేష్‌కుమార్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగంలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు సింబియోసిస్ టెక్నాలజీస్ సీఈవో ఓరుగంటి నరేష్‌కుమార్ ముందుకు వచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రూ.12 లక్షల చెక్కును రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ అకడమిక్ సెనేట్ సభ్యులు డాక్టర్ కుమార్‌రాజ, తదితరులు పాల్గొన్నారు.

3న ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని ఏయూ యోగా కేంద్రంలో ఈ నెల 3న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ప్రత్యేక ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాంత్ర వైద్యాధికారి డాక్టర్ కె.ఈశ్వరరావు చర్మ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారిని పరీక్షించి తగిన చికిత్స విధానాలు, ఔషధాలు సూచించనున్నారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94401 91673 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

10వ వార్డులో మరో అక్రమ నిర్మాణంపై కొరడా

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో మరో అక్రమ నిర్మాణాన్ని జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ వార్డులో ఎక్కువగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్టు స్థానికులు జీవీఎంసీ కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదులు చేశారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వాటిపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 28న ఆదర్శనగర్‌లో అనధికారిక నిర్మాణం తొలగించారు. తాజాగా శుక్రవారం రవీంద్రనగర్ ప్రాంతం వివేకానందనగర్ వినాయక గుడి వెనుక ఓ వ్యక్తి చేపట్టిన అనధికారిక నిర్మాణాన్ని కూల్చివేశారు. ఇందిరానగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వాటిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డులకు దరఖాస్తులు

మహారాణిపేట: నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సిహెచ్. సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్, వాటర్(సముద్రం) కేటగిరీల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. జీవితకాల సాధన సాహస కృత్య కేటగిరీల్లో గత మూడేళ్ల కాలంలో అద్భుతమైన పనితీరు కనబరిచి విజయం సాధించిన వ్యక్తులు అర్హులన్నారు. వివరాలు, దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి https://awards.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అప్‌లోడ్ చేసిన పత్రాలు, నామినేషన్ సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు దరఖాస్తును ఈనెల 4వ తేదీలోగా జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేటలో పని వేళల్లో సమర్పించాలని ఆయన కోరారు.

వైద్య రంగంలో నర్సుల పాత్ర కీలకం



క్యాపింగ్ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, డిప్యూటీ మేయర్ శ్రీధర్ తదితరులు

ఆరిలోవ: వైద్య రంగంలో నర్సుల సేవలు చాలా కీలకపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఉదయ దొర సెయింట్ జోసఫ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ 34వ క్యాపింగ్ వేడుకను శుక్రవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఎంతో మంది నర్సులు ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించారన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీధర్, ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ సునీత, కాలేజ్ చైర్మన్ సునీత రెడ్డి, డాక్టర్ మురళీ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాన్వెంట్ జంక్షన్ సర్వీస్ రోడ్డులో మృతదేహం

మహారాణిపేట: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కాన్వెంట్ జంక్షన్ సర్వీస్ రోడ్డులో సుమారు 35 ఏళ్ల వయసు గల ఓ గుర్తు తెలియని మగ మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. సదరు మృతుడు ఫిట్స్‌తో బాధపడుతున్నట్టు తేలింది. అతడి పేరు, చిరునామా వివరాలు తెలియలేదు. ఇతడి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. ఎవరికైనా మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 10 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీసీపీ సునీత

అల్లిపురం: జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి పది ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారి సునీత పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో 2వ జోన్‌కు రెండు, 5వ జోన్‌కు 4, 6వ జోన్‌కు 1, 8వ జోన్‌కు 3.. మొత్తం 10 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధి, ఎనిమిది జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు జరుగుతున్నా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు ఇష్టానుసారం డంప్ చేసినా జీవీఎంసీలో టోల్ ఫ్రీ నంబరు 18004250009కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు. అలాగే వాట్సాప్ నంబర్ 8187897569కు పూర్తి వివరాలతో పంపితే చర్యలు చేపతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీ నరేంద్రరెడ్డి, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతో వ్యాధుల నివారణ



అవగాహన కల్పిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

ఎంవీపీ కాలనీ: వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని జీవీఎంసీ మలేరియా అధికారులు పిలుపునిచ్చారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం ఎంవీపీ కాలనీ 18వ వార్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ దోమలు పెరిగే ప్రదేశాలు, జ్వరాల బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. డెంగ్యూ దోమలు మంచినీటిలోనే పెరుగుతాయన్నారు. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇంటి అవసరాల కోసం వినియోగించే నీటి తొట్టెలను వారానికి ఒక సారి శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా అధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మరిడిమాంబ 182వ నవరాత్రి ఉత్సవాలు

ఎంవీపీ కాలనీ: చినవాల్తేర్ రెల్లివీధి గ్రామ దేవత శ్రీమరిడమాంబ అమ్మవారి 182వ నవరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నా అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం అమ్మవారికి ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. 8న అమ్మవారి తొలేళ్ల పండగ, 9న అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జాలరిపేటలో ఈ–శ్రమ్ కార్డుల పంపిణీ



కార్మికుడికి గుర్తింపు కార్డు అందిస్తున్న రవీంద్ర తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో బీజేపీ జిల్లా శ్రేణుల ఆధ్వర్యంలో కార్మికులకు ఈ–శ్రమ్ గుర్తింపు కార్డులు అందజేశారు. శుక్రవారం రాత్రి ఈ–శ్రమ్ పోర్టల్‌లో స్థానిక కార్మికుల వివరాలు నమోదు చేయడంతో పాటు గుర్తింపు కార్డులను ఆ పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న లక్ష్మణ్

కొమ్మాది: జ్యూస్ షాప్‌లో పనిచేస్తున్న యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సాగర్‌నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద శ్రీ సిద్ధి వినాయక జ్యూస్ అండ్ మిల్క్ షేక్ సెంటర్ ఉంది. ఇందులో బానాల లక్ష్మణ్ (19) పని చేస్తున్నాడు. ఆయన ఐదేళ్ల వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈ యువకుడు గతంలో ఎండాడలో పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆరు నెలల కిందట ఇక్కడ సాగర్ నగర్‌లోని జ్యూస్ సెంటర్‌లో పనికి చేరాడు. యజమాని నాగిరెడ్డి ఢిల్లీరావు పనితో పాటు ఎంఐజీ సముదాయంలోని ఆయన ఇంట్లోనే నివాసం ఉండేందుకు అవకాశం కల్పించాడు. అప్పటి నుంచి లక్ష్మణ్ ఇక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి యథావిధిగా వ్యాపారం ముగించుకుని రాత్రి ఇంటికి చేరుకుని అందరూ కలసి భోజనం చేసి నిద్రించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీరావు లేచి చూసేప్పటికి లక్ష్మణ్ కనపడకపోవడంతో షాప్‌కు వెళ్లి చూశారు. షటర్ ఎత్తి చూడగా లక్ష్మణ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. సమాచారం అందుకున్న ఆరిలోవ ఎస్‌ఐ అప్పారావు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపరాడు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం గురుద్వార్ దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద వామపక్షాలు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలపై దశలవారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు లక్ష్మి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, విమల, పి.మణి, బి.వెంకటరావు, ఎం.సుబ్బారావు, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు, రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం: ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. హౌరా–తిరుపతి (22889) ఎక్స్‌ప్రెస్ శనివారం రద్దు చేశారు. 2న తిరుపతి–హౌరా(22890) ఎక్స్‌ప్రెస్, సంత్రగచ్చి–ఎంజీఆర్ చెన్నైసెంట్రల్ (22808) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 4న ఎంజీఆర్ చెన్నైసెంట్రల్ – సంత్రగచ్చి(22807) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

పలు రైళ్ల రీషెడ్యూల్

- విశాఖపట్నంలో శుక్రవారం రాత్రి 9.05 గంటలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం– కోర్బా (18518) ఎక్స్‌ప్రెస్ సుమారు 2.30 గంటలు ఆలస్యంగా రాత్రి 11.30 గంటలకు బయలుదేరింది.
- విశాఖపట్నంలో శనివారం బయలుదేరాల్సిన విశాఖపట్నం–బెంగళూరు కంటోన్మెంట్ (08915) వన్‌వే స్పెషల్ సుమారు 2 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయోగాత్మక హాల్ట్
- ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా భువనేశ్వర్ లో జూలై 6న భువనేశ్వర్–సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు మిర్యాలగూడ, నల్గొండలో ప్రయోగాత్మక హాల్ట్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

గౌహతి–సికింద్రాబాద్ మధ్య స్పెషల్

ప్రయాణికుల రద్దీ తగ్గించేందుకు గౌహతి–సికింద్రాబాద్ మధ్య సింగిల్ ట్రిప్ స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. గౌహతి–సికింద్రాబాద్(05614) స్పెషల్ జూలై 2వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు గౌహతిలో బయలుదేరుతుంది. మరుసటి రోజు సాయంత్రం 5.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 5.35 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్–గౌహతి(05613) స్పెషల్ సికింద్రాబాద్‌లో జూలై 9వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 11.45 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 12.50 (మధ్య రాత్రి) గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి మధ్య రాత్రి 1.10గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 10.20 గంటలకు గౌహతి వెళ్తుంది.

కనకమహాలక్ష్మికి బంగారు నక్లెస్ బహూకరణ



ఈవో శిరీషకు నక్లెస్ అందజేస్తున్న దాత చిల్లా వెంకటలక్ష్మి

అల్లిపురం: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి సీతమ్మధార టీపీటీ కాలనీకి చెందిన చిల్లా సత్యనారాయణరెడ్డి 61వ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు చిల్లా వెంకటలక్ష్మి 77 గ్రాముల 310 మిల్లీ గ్రాముల బంగారు నక్లెస్‌ను దేవస్థానం ఈవో కె.శిరీషకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రి @152

నేడు వ్యవస్థాపక దినోత్సవం



ఏయూ క్యాంపస్: విశాఖలోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి 152వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకోవడానికి సిద్ధమైంది. ప్రతి సంవత్సరం లక్ష మందికిపైగా రోగులకు సేవలు అందిస్తూ రాష్ట్రానికే ఈ వైద్యాలయం తలమానికంగా నిలిచింది. 1871 జూలై 1న 90 పడకల ఆస్పత్రిగా ప్రారంభమై నేడు కొత్తవార్డులతో 35 మంది మానసిక వైద్యులతో వందలాది మందికి మానసిక చికిత్సను అందించే దిశగా నిత్యం పనిచేస్తోంది. ప్రస్తుతం 300 పడకల ఆస్పత్రిగా ఉన్న దీనిలో త్వరలో చిన్నపిల్లలు, వృద్ధులు, డి అడిక్షన్ విభాగాలకు సంబంధించి మరో వంద పడకలు రానున్నాయి. 1979లో రెండు పీజీ సీట్లు కలిగిన ఈ ఆస్పత్రి జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ పీజీ సీట్లను 19 నుంచి 24కు పెంచుకుంది. యూపీ, పంజాబ్, రాజస్థాన్, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసించడానికి వస్తుంటారు. త్వరలో క్లినికల్ సైకాలజీ, సైకియాట్రిక్ నర్సింగ్, సోషల్ వర్కర్ వంటి పలు విభాగాలలో శిక్షణ ప్రారంభం కానుంది. 2017లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా, 2021లో ఐఎస్‌వో గుర్తింపులతో పాటు రెండు రోజుల క్రితం ఎన్‌ఏబీహెచ్ బృందం వెరిఫికేషన్ అసెస్‌మెంట్‌ను పూర్తి చేసుకుంది. నూతన అకడమిక్ బ్లాక్, 60 మంది పీజీ విద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణం తుది దశకు చేరుకున్నాయి. త్వరలో అధునాతన సదుపాయాలు, మరిన్ని పోస్టుల భర్తీ జరగనుందని సూపరింటెండెంట్ కె.వి.రామిరెడ్డి తెలిపారు.